క్లుప్తంగా

9 నుంచి లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాలు

వెల్దండ: మండలంలోని బైరాపూర్‌లో ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్సవాలలో భాగంగా 9వ తేదీన మేదినిపూజ విశ్వక్సేన ఆరాధన, రక్షా బంధనం, 10న అర్చన, ధ్వజారోహణం, హోమం, పూర్ణాహుతి, పల్లకీసేవ, ఎదుర్కోళ్లు, 11న నిత్యహోమం, అభిషేకం, పూర్ణాహుతి, రాత్రి 7 గంటలకు లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం, 12న పుష్పయాగం, తీర్థగోష్ఠి, గరుడవాహన సేవ ఉంటుందని తెలిపారు. చివరిరోజు 13న తెల్లవారుజామున స్వామివారి రథోత్సవం, సాయంత్రం ధ్వజారోహణం, అశ్వవాహనసేవతో ఉత్సవాలు ముగియనున్నాయి.

రాజీవ్ యువ వికాసం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

ఉప్పునుంతల: మండలంలో రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 7 తేదీ నుంచి 13వ తేదీ వరకు ఉదయం 10:30 గంటల నుంచి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ మోహన్ లాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీన బుధవారం మైనారిటీ కార్పొరేషన్ కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు, ఈ నెల 8న ఎస్టీ కార్పొరేషన్‌కు సంబంధించిన వారికి, ఈనెల 12న బీసీ కార్పొరేషన్ సంబంధించిన అభ్యర్థులకు, ఈ నెల 13న ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తునట్లు తెలిపారు.

నేడు ఇంటర్వ్యూలు

తిమ్మాజిపేట: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం మండల కేంద్రంలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఎంపీడీఓ లక్ష్మీదేవి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

వంగూరు: పంటల్లో అధిక దిగుబడి సాధించేందుకు రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లురవి అన్నారు. సోమవారం మండలంలోని కొండారెడ్డిపల్లిలో నిర్వహించిన రైతుల ముంగిట వ్యవసాయ శాస్త్రవేత్తల కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. సాగునీరు, ఉచిత విద్యుత్‌ను నిరంతరంగా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్తలు బాల్‌రాం, సుధాకర్‌రెడ్డి, డాక్టర్ శైలజ, చంద్రశేఖర్, కల్వకుర్తి మార్కెట్ వైస్ చైర్మన్ పండిత్‌రావు, మండల వ్యవసాయాధికారిణి ప్రియదర్శిని, రైతులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సమ్మె నోటీసు

కల్వకుర్తి రూరల్: కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నామని గ్రామ పంచాయతీ కార్మికులు సోమవారం ఎంపీడీఓ వెంకటరాములుకు సమ్మె నోటీస్ అందజేశారు. గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి శంకర్ నోటీసును అందించారు. ఆంజనేయులు, మైసమ్మ, మల్లేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం విక్రయించొద్దు

కొల్లాపూర్ రూరల్: దళారులకు ధాన్యం విక్రయించొద్దని మాజీ జెడ్పీటీసీ హనుమంత్ నాయక్, సింగిల్ విండో డైరెక్టర్ రఘుపతిరావు అన్నారు. సోమవారం మండలంలోని కుడికిల్లలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. వానాకాలం సీజన్‌లో అవకతవకలు జరిగాయని రైతులు వెలుగు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కృష్ణయ్య, అంజనేయులు, బయన్న, చెన్నయ్య, శేఖర్, పరమేష్, ఏపీఎం గౌస్, మహిళ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

20న జరిగే సమ్మెను జయప్రదం చేద్దాం

పాన్‌గల్: కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని కోరుతూ జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్ల అసోసియేషన్ల పిలుపు మేరకు ఈనెల 20వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు, కర్షకులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ సూర్యవంశ రాము అన్నారు. తెలంగాణ జీపీ ఎంప్లాయిస్ మరియు వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ గోవింద్‌రావుకు సమ్మె నోటీసు అందజేశారు. నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రైతువేదికల నిర్వహణపై నిర్లక్ష్యం


చర్ల ఇటిక్యాలలోని రైతు వేదిక

- నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- వ్యవసాయ అధికారులపై ఆర్థికభారం

తాడూరు: వ్యవసాయంలో రైతులకు మెరుగైన సలహాలు, సూచనలు అందిస్తూ ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తూ ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం రైతు వేదికల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మండలంలో 24 గ్రామ పంచాయతీలకు 7 క్లస్టర్‌లుగా విభజించి 7 రైతు వేదికలను నిర్మించింది. రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రతి మంగళవారం హైదరాబాద్ కేంద్రం నుంచి శాస్త్రవేత్తలు సూచనలు అందిస్తున్నారు.

విడుదల కాని నిధులు

మండలంలో 5 వేల ఎకరాలకు ఒక్క వ్యవసాయ క్లస్టర్ చొప్పున ఒక రైతు వేదికను నిర్మించారు. మొదట్లో ఒక్కో రైతు వేదిక నిర్వహణకు రూ.9 వేలు విడుదల చేశారు. కాని దాదాపు 30 నెలల


తాడూరు రైతువేదిక ఎదుట ఎడ్ల బండ్లతో నిర్మించిన రైతువేదిక చిహ్నం

నుంచి రైతు వేదికలను నిధులు మంజూరు కాకపోవడంతో నిర్వహణ భారంగా మారింది. ప్రతినెల నిర్వహణ ఖర్చులు ఏఓ, ఏఈఓలే భరించాల్సి వస్తోంది.

సిబ్బంది లేక ఇబ్బందులు

రైతు వేదికల్లో అవసరమైన సిబ్బందిని ప్రభుత్వం నియమించలేదు. కనీసం అటెండర్లు కూడా లేక పోవడంతో ఏఓ, ఏఈఓలే చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ బిల్లు, నీటి వసతి, నైట్ వాచ్‌మెన్, స్టేషనరీ, శిక్షణ కార్యక్రమాలకు అధికారులు భరించాల్సి వస్తుంది. మరుగుదొడ్లు, మూత్రశాలలు కూడా నిరుపయోగంగా మారాయి. ఉన్నత అధికారులు స్పందించి నిర్వహణ నిధులు విడుదల చేసి రైతు వేదికల్లో కనీస వసతులను కల్పించి సిబ్బందిని నియమించాలని రైతులు కోరుతున్నారు.

మండలంలో ఇలా..

తాడూరు క్లస్టర్‌లో చర్లతిర్మలాపూర్, సిర్సవాడ క్లస్టర్‌లో పాపగల్, ఐతోలు, ఇంద్రకల్, అల్లాపూర్ క్లస్టర్‌లో మేడిపూర్ గుంతకోడురు, పోల్కంపల్లి, గుట్టలపల్లి, బలాన్‌పల్లి క్లస్టర్ గోవిందాయపల్లి, యటిదారిపల్లి, యాదిరెడ్డిపల్లి క్లస్టర్‌లో యంగంపల్లి, అకునెల్లికుదురు, అంతారం నాగదేవపల్లి, చర్ల ఇటిక్యాల క్లస్టర్‌లో తుమ్మలసుగురు, యాత్మతాపూర్, పర్వాతాయపల్లి 7 క్లస్టర్‌లో రైతు వేదికల నిర్మాణం పూర్తి చేశారు.

> **సొంత డబ్బులు ఖర్చుపెడుతున్నాం**
>
> రైతు వేదికల నిర్వహణ కోసం ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదు. దీంతో నిర్వహణ భారంగా మారింది. అవగాహన సదస్సులకు అవసరమయ్యే డబ్బులను సొంతంగా పెడుతున్నాం. విద్యుత్, తాగునీటి, స్వీపర్ ఖర్చులకు స్వంతంగా చెల్లించాల్సి వస్తోంది.
>
> – సందీప్‌కుమార్‌రెడ్డి, ఏఓ, తాడూరు

వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం


తెలకపల్లిలో వేసవి శిబిరంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి


తిమ్మాజిపేటలో హాజరైన విద్యార్థులు

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. తెలకపల్లి జెడ్పీహెచ్ఎస్, మండలంలోని తాండ్ర ఉన్నత పాఠశాల, వెల్దండ మండల కేంద్రంతో పాటు పెద్దాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తిమ్మాజిపేట, చారకొండ, లింగాలలో జెడ్పీహెచ్ఎస్, పెద్దకొత్తపల్లి దేవని తిర్మాలాపూర్ ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేశారు. తెలకపల్లిలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, బిజినేపల్లిలో ఎంఈఓ రఘునందన్‌రావు, వెల్దండలో ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రుడు, తిమ్మాజిపేటలో మండల విద్యాధికారి సత్యనారాయణశెట్టి, తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, పెద్దకొత్తపల్లి దేవని తిర్మాలాపూర్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, లింగాలలో సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి, తాండ్రలో హెచ్ఎం జహంగీర్‌లు శిబిరాలను ప్రారంభించారు.

కోనేరు పునర్నిర్మాణ పనుల పరిశీలన


కొలతలు వేస్తున్న ఎండోమెంట్ అధికారులు

వెల్దండ: మండలంలోని గుండాలలో కోనేరు పునర్నిర్మాణ పనులకు నాగర్‌కర్నూల్ జిల్లా ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ ఏఈ రానవీర్, సపతి సంజయ్‌లు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కోనేరుపై ఇనుపజాలి ఏర్పాటుకు కొలతలను వేశారు. ఆలయంలోని మండపాలను పునఃనిర్మాణం, భక్తులకు విశ్రాంతి గదుల నిర్మాణం తదితర వాటిపై కొలతలు తీసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఉత్సవాల సందర్భంగా కోనేరులో పడి విద్యార్థి మృతి చెందడం బాధాకరమని భవిష్యత్‌లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా భద్రత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడుతామన్నారు. ఆలయంలో చేపడుతున్న పునఃనిర్మాణాలకు దాతలు ముందుకు వచ్చి సహకరించాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరుతున్నారు. ఈఓ ప్రసాద్, ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఉన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి


రైతులకు అవగాహన కల్పిస్తున్న శశిభూషణ్

తాడూరు: ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి సాధ్యమని శాస్త్రవేత్తలు శశిభూషణ్, రమేష్‌లు అన్నారు. సోమవారం మండలంలోని చర్ల ఇటిక్యాలలో రైతులకు పంటసాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు సాగులో అనుసరించే యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి భాస్కర్, ఏడీ పుర్నచందర్‌రెడ్డి, సందీప్ రెడ్డి, జగన్, కార్తిక్, రైతులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

కోడేరు: రైస్ మిల్లు యజమానులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మిల్లర్లు క్వింటాలుకు 4–6 కిలోల కోత విధిస్తున్నారని వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగయ్య, విష్ణు, శివమ్మ, అక్కమ్మ, తదితరులు పాల్గొన్నారు.


కోడేరులో వరిధాన్యం పరిశీలిస్తున్న సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు

మహిళ మెడలో గొలుసు చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు చోరీకి గురైన సంఘటన జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం చోటుచేసుకోగా, సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన సరిత అచ్చంపేటలో జరిగే బొడ్రాయి పండుగకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చింది. గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలో నుంచి 3తులాల బంగారు గొలుసు చోరీ చేశాడు. బాధితురాలు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదకరంగా కుంట కట్ట రోడ్డు


దారారం సమీపంలో కుంట కట్టపై ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

లింగాల: మండలంలోని దారారం సమీపంలో కుంట కట్టపై ఉన్న సింగిల్ రోడ్డు ప్రమాదభరితంగా మారింది. ఈ మార్గం వెంట ప్రతి రోజు మండల కేంద్రం నుంచి క్యాంపు రాయవరం, రాయవరం, వడ్డెరాయవరం, యాపట్ల, పెద్దకొత్తపల్లి తదితర గ్రామాలకు వాహనాల రాకపోకలు కొనసాగుతాయి. కుంట కట్టపై ఉన్న రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడలు లేక పోవడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. వాహనాలు అదుపుతప్పితే కుంటలోకి వెళ్లే అవకాశాలు ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. రోడ్డుకు మరమ్మతు చేయకపోవడంతో రోడ్డు ఎగుడు దిగుడుగా మారింది. మూలమలుపులు ఉండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి రోడ్డును వెడల్పు చేయాలని, రక్షణ గోడలు నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

మామిళ్లపల్లి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లి లక్ష్మీ నరసింహ్మస్వామి ఆలయంలో సోమవారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సతీసమేతంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దంపతులను సన్మానించారు. ఆలయ కమిటీ చైర్మన్ వేముల నర్సింహరావు, కమిటీ సభ్యులు స్వరూప తదితరులు, నాయకులు అనంతరెడ్డి, నర్సింహరెడ్డి, అనంత ప్రతాప్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, భాస్కర్, శేఖర్‌గౌడ్, మోహన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

బోరు డ్రిల్లింగ్

తిమ్మాజిపేట: మండలంలోని బుద్ధసముద్రంలో తాగునీటి సమస్య ఉందని ఇటీవల గ్రామస్తులు ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఎమ్మెల్యే స్పందించి సోమవారం గ్రామంలో బోరు డ్రిల్లింగ్ చేయించారు. నీరు పుష్కలంగా రావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేసి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం మాటలు బాధ్యతారాహిత్యం

కల్వకుర్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు ఆయన బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులను కించపరుస్తూ మాట్లాడడం సరికాదన్నారు. గతంలో మాజీ సీఎం కేసీఆర్ ఉద్యోగులను ఇబ్బందులను గురిచేశారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి వెంటనే ఉద్యోగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

యువతి అదృశ్యం: కేసు నమోదు

పాన్‌గల్: యువతి అదృశ్యమైన ఘటనపై సోమవారం కేసు నమోదైనట్లు ప్రొహిబిషన్ ఎస్ఐ హిమబిందు తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్లాయిపల్లికి చెందిన చింతకుంట బాలమ్మ, బాలయ్య కుమార్తె దీపిక(19) ఇంటర్ వరకు చదివి ఇంటి వద్దే ఉంటోంది. ఈనెల 4న తల్లిదండ్రులు కూలీ పనుల కోసం వెళ్లగా దీపిక ఇంట్లోనే ఉంది. తల్లిదండ్రులు కూలీ పనులు ముగించుకొని సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో కుమార్తె కనిపించకపోవడంతెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. యువతి తల్లి బాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయ నిర్మాణానికి చేయూత



కల్వకుర్తి రూరల్: మండలంలోని ఎలికట్టలో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయ నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారం అందించారు. సోమవారం ఆలయ నిర్మాణానికి 150 బస్తాల సిమెంట్‌ను ఆలయ కమిటీ నిర్వాహకులకు అప్పగించారు. కార్యక్రమంలో భీమయ్య, కేశవులు, రవి, ఆంజనేయులు, మల్లేష్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

వెల్దండ: మండలంలోని కొట్రగేట్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఒకరికి గాయాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ కురుమూర్తి వివరాల ప్రకారం వంగూర్ మండలం చింతపల్లి గ్రామానికి చెందిన గులామ్ హుస్సేన్ పనినిమిత్తం బైక్‌పై కొట్ర గేట్‌కు వెళ్లాడు. పనులు ముగించుకొని గ్రామానికి బయలుదేరగా కొట్ర గేట్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొన్నది. ఈప్రమాదంలో హుస్సేన్‌కు గాయాలయ్యాయి. బాధితుడి కుమారుడు ఎండీ రఫీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

కొల్లాపూర్/కొల్లాపూర్ రూరల్: పట్టణంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు కలెక్టర్ బదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలిసి సమస్యలను విన్నవించారు. ఆస్పత్రిలో వైద్యులను నియమించాలని కోరారు. జలాల్ శివుడు, చంద్రశేఖర్‌రావు, రామన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కల్వకుర్తి రోడ్డు: పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల సమస్యలు పరిష్కరించాలని డబుల్ బెడ్రూం ఇళ్ల డెవలప్‌మెంట్ సొసైటీ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ బదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సొసైటీ కార్యదర్శి నరసింహ, కృష్ణవేణి, సాయిబాబా, పద్మ, కిరణ్ చారి, రాజు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మైనర్‌ను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు

తిమ్మాజిపేట: మైనర్ బాలికను పెళ్లి చేసుకొని వేధించిన ఓ వ్యక్తిపై రేప్, పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు జడ్చర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తిమ్మాజిపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన 16 ఏళ్ల మైనర్ బాలికను వివాహం చేసుకున్నాడు. తరుచూ బాలికను వేధిస్తుండడంతో రెండు రోజుల కిందట నాగర్‌కర్నూల్ ఆర్టీసీ బస్టాండులో కూర్చుంది. సమాచారం అందుకున్న సఖీ కేంద్రం వారు సోమవారం తిమ్మాజిపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారు. బాలికను చైల్డ్ హోమ్‌కు తరలించారు.

తహసీల్దార్‌కు వినతి


తహసీల్దార్ కార్తీక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

వెల్దండ: మండలంలోని బండోనిపల్లి పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలాలను పక్కన ఉన్న రైతులు కబ్జా చేస్తున్నారని లబ్ధిదారులు సోమవారం తహసీల్దార్ కార్తీక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 300లో 2.10 గుంటల భూమిని ప్రభుత్వం 1995 సంవత్సరంలో భూమి కొనుగోలు చేసి ఇంటి స్థలాలు, ఇళ్లను నిర్మించి 28 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసిందన్నారు. అప్పటి లేవట్‌లో ఖాళీగా ఉన్న స్థలంతో పాటు రోడ్లను కబ్జా చేస్తున్నట్లు లబ్ధిదారులు వాపోయారు. ఇళ్లను కూల్చి వేస్తామని దౌర్జన్యానికి పాల్పపడుతూ భయాందోళనకు గురిచేస్తున్నారని వివరించారు. ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్లను పూర్తి సర్వే చేసి లబ్ధిదారులకు న్యాయం చేయాలని వారు తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శంకరయ్య, లబ్ధిదారులు నిరంజన్, కిషోర్, అర్జున్, రత్నం, దేవయ్య, అంజయ్య, గెల్వయ్య, బాలమ్మ, కళమ్మ, అనసూయ, తిరుపతమ్మ, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

పెండింగ్ ఏరియర్స్‌ను చెల్లించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: మున్సిపాలిటీలో పెండింగ్ ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఏరియర్స్ చెల్లించకపోతే ఈ నెల 9న నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. అనంతరం సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు భీముడు, బాలరాజు, కుర్మయ్య, మహేష్, పాషా, దశరథం, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మ బోనాలు


బోనం ఎత్తిన మహిళలు

చారకొండ: మండలంలోని మర్రిపల్లిలో పబ్బతి ఆంజనేయస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ నిర్మాణంలో భాగంగా సోమవారం గ్రామస్తులు, దేవాలయ కమిటీ బోనాల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. మహిళలు పూనకాలు ఊగారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

దివ్యాంగులకు పరికరాలు అందించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: దివ్యాంగులకు ఉచితంగా పరికరాలు అందించాలని కోరుతూ ఎన్‌టీఆర్‌టీ వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధికారిని రాజేశ్వరికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కుర్మయ్య, ఉపాధ్యక్షుడు జి.అంజయ్య, జిల్లా కమిటీ సభ్యులు వల్లమ్మ, శ్రీనివాసు, నర్సాజి, అంజయ్య, పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులను అందజేస్తున్న మాజీ సర్పంచ్ రామకృష్ణ

వెల్దండ: మండలంలోని కంటోనిపల్లి గ్రామానికి చెందిన కె. వెంకటయ్యకు రూ.21వేలు, కూన ప్రేమలతకు రూ.34 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం మాజీ సర్పంచ్ పెద్ది రామకృష్ణ మంజూరైన చెక్కులను బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సురేందర్, గ్రామస్తులు ఉన్నారు.

కోడేరు: మండలంలోని పస్పుల, మాచుపల్లి, తదితర గ్రామాల్లో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. పస్పుల గ్రామానికి చెందిన లక్ష్మికి రూ.60వేలు, రేణుకకు రూ.29వేలు, బిచ్చారావుకు రూ.55వేల చెక్కులను కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ మల్లయ్య అందజేశారు.

కార్ల్‌మార్క్స్ స్ఫూర్తితో ముందుకెళ్దాం


నివాళులర్పిస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: కార్ల్‌మార్క్స్ స్ఫూర్తితో ముందుకెళ్దామని సీపీఎం మండల నాయకుడు సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని బొందలపల్లిలో కార్ల్‌మార్క్స్ 207 జయంతిని నిర్వహించారు. కార్ల్‌మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జీవ, మధు, నరేష్, బాలస్వామి, సింగోటం, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శతచండీ మహాయాగం


బొడ్రాయికి అభిషేకం చేస్తున్న భక్తులు

తాడూరు: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న శత చండీ మహాయాగంలో భాగంగా మొదటి రోజు సోమవారం గ్రామ దేవతల పూజ అభిషేకం, గణపతి, పుణ్యాహవాచనం, యాగమంటపం ప్రవేశం వంటి కార్యక్రమాలు కొనసాగాయి. బొడ్రాయికి పంచాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో రమ్యకృష్ణ, అనూప్‌శర్మ, సుదాంశ్ శర్మ, మురళీధర్‌శర్మ, మల్లయ్య, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, కె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా సుదర్శన్‌రెడ్డి

వంగూరు: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా సుదర్శన్‌రెడ్డి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటరమణ నాగర్‌కర్నూల్ రెవెన్యూ కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ అయ్యాడు.